18న వందల సంఖ్యలో వినాయకుల నిమజ్జనం

శంషాబాద్: పట్టణంలో ఈ నెల 18న వినాయక నిమజ్జనం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది నగరంలోని గణేష్ నిమజ్జనం ముగిసిన తర్వాతే ఇక్కడ నిమజ్జనం నిర్వహిస్తారు. పట్టణంలో సుమారు 1000కి పైగా వినాయకులను ఏర్పాటు చేశారు. కాముని చెరువు, గొల్లపల్లి చెరువుల్లో గణపతి నిమజ్జనానికి మున్సిపల్, రెవిన్యూ, పోలీసులు ఏర్పాట్లు చేయగా, ఆయా చెరువుల వద్ద క్రేన్లు కూడా పెట్టారు. 3వ రోజు నుంచి నిమజ్జనాలు జరుగుతున్నప్పటికి 100 సంఖ్యలో వినాయకులను మాత్రం బుధవారం నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించాలి



అడ్వకేట్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహిత హిల్స్‌లోని జేపీఎల్ స్నేహ సదన్ అపార్ట్‌మెంట్‌లో అడ్వకేట్ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజలకు న్యాయ సలహాలు, సూచనలు అందిస్తూ వారికి సరైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు నారాయణగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రజ్ఞగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

మణికొండ: సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించటంతో మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పత్తికుంటను సందర్శించిన సైబరాబాద్ కమిషనర్



పత్తికుంట చెరువును సందర్శిస్తున్న సైబరాబాద్ కమిషనర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పత్తికుంట చెరువును సోమవారం మధ్యాహ్నం సైబరాబాద్ కమిషనర్ మహంతి సందర్శించారు. ఈ సందర్భంగా 9,11 రోజుల నిమజ్జనాల ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు సూచనలు అందజేశారు. కమిషనర్ వెంట రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, అధికారులు, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ తదితరులు ఉన్నారు.



అలకాపూర్ లడ్డూను రూ.16లక్షలకు దక్కించుకున్న ప్రణీత్ కాన్సెప్ట్ అధినేత సురేష్



అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కు లడ్డూను రూ.6.01లక్షలకు దక్కించుకున్న కస్తూరి రాములు



మంచిరేవులలో లడ్డూను రూ. 6.51లక్షలకు దక్కించుకున్న శ్రీనివాస్ ముదిరాజ్



పుప్పాలగూడలో లడ్డూను రూ. 2.25లక్షలకు తీసుకున్న విజయ్‌కుమార్



ఖానాపూర్ ముదిరాజ్ కాలనీ గణేష్ లడ్డూను రూ.2.70లక్షలకు తీసుకున్న రాజలింగం



నార్సింగిలో లడ్డూను రూ.1.25లక్షలకు తీసుకున్న వినోద్‌కుమార్



వట్టినాగులపల్లిలో లడ్డూను రూ. 2.10లక్షలకు దక్కించుకున్న శివముదిరాజ్



గండిపేటలో లడ్డూను రూ. 1.21లక్షలకు దక్కించుకున్న గోపాల అభిజిత్



ఓషియన్ పార్క్ వినాయకుడి లడ్డూను రూ. 2.36లక్షలకు స్వంతం చేసుకున్న ముగి జంగారెడ్డి

రూ.లక్షలు పలికిన లంబోదరుని లడ్డూలు

మణికొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలతో పాటు లడ్డూల వేలం పాటలు ఉత్సాహంగా జరిగాయి. అందులో భాగంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో లడ్డూల వేల పాటలు అర్ధరాత్రి వరకు హోరా, హోరీగా జరిగాయి. ఈ నేపథ్యంలో మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లో గత సంవత్సరం లడ్డూ రూ. 10లక్షలు పలకగా ఈ సారి అది ఏకంగా రూ. 16 లక్షలకు పెరిగింది. జంట మున్సిపాలిటీల పరిధిలో ఇదే ఇప్పటి వరకు ఆల్‌టైం రికార్డుగా నిలిచింది. మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడ గ్రామంలోని ఆంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను 3లక్షల 5వేలకు స్థానిక రజక సంఘం సభ్యులు ముత్యాల పందిరి వేణు కైవసం చేసుకున్నారు. మధుబన్ కాలనీ, పద్మశాలిపురం బస్తీలలో శ్రీనివాస యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన లడ్డును ఆర్మీ రిటైర్ అధికారి ఎంఎన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మధుబన్ కాలనీకి చెందిన రాజ్‌కుమార్‌రెడ్డి 99 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. అదే కాలనీకి చెందిన మరో గణపతి లడ్డును 57 వేలకు అనిల్ కుమార్ గుప్తా వేలంలో దక్కించుకున్నారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాధానగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను కోట్ల పెంటారెడ్డి రూ.7 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే యాదాద్రి కాలనీలోని గణపతి లడ్డూను వేలం పాటలో రమేష్‌బాబు రూ.96 వేలకు దక్కించుకున్నారు. ప్రధాన వినాయకుల వద్ద మంగళవారం వేలం పాటలు, నిమజ్జనాలు జరుగుతుండటంతో వాటి లడ్డూలు ఏ ధరకు పలుకుతాయోనని ప్రజలు ఉత్కంఠగా ఎదిరిచూస్తున్నారు.



3లక్షల 5వేలకు లడ్డును కైవసం చేసుకున్న ముత్యాలపందిరి వేణు



శ్రీనివాస యూత్ అసోసియేషన్ గణనాథుడి లడ్డును 99 వేలకు కైవసం చేసుకున్న రాజ్ కుమార్‌రెడ్డి



అనిల్ కుమార్ గుప్తా 57వేలకు కైవసం చేసుకున్న లడ్డును అందిస్తున్న ఆర్మీ రిటైర్ అధికారి ఎంఎన్ రెడ్డి



అత్తాపూర్‌లోని జనప్రియ ఉటోపియా అపార్ట్‌మెంట్స్‌లో రూ. 1.60 వేలకు పైగా లడ్డూను కైవసం చేసుకున్న సాయి కిరణ్



అలకాపూర్ టౌన్‌షిప్ సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్కు గణేష్ లడ్డూను రూ.2.01లక్షలకు దక్కించుకున్న మధుసూదన్‌రెడ్డి, లత



మైలార్‌దేవ్‌పల్లిలో ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని రూ. 2లక్షలకు పైగా లడ్డూను కైవసం చేసుకున్న కమల్ కిషోర్



హైదర్‌గూడలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో లడ్డూను రూ.70 వేలకు కైవసం చేసుకున్న ఉప్పల దేవరాజ్ కుటుంబ సభ్యులు



రాధానగర్ కాలనీలోని లడ్డూను రూ.7.07 లక్షలకు దక్కించుకున్న కోట్ల పెంటారెడ్డిని సన్మానిస్తున్న నిర్వహకులు



యాదాద్రి కాలనీలో రూ.96 వేలకు లడ్డూను కైవసం చేసుకున్న రమేష్‌బాబు



యాదవ మిత్ర కాలనీలోని లడ్డూను రూ.60 వేలకు కైవసం చేసుకున్న రాజేష్‌ముదిరాజ్

ఆనందోత్సాహాల మధ్య వినాయక నిమజ్జనోత్సవాలు



వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ సామూహిక ఊరేగింపు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సాగింది. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో ప్రతిష్ఠించిన గణనాథులను ఆనవాయితీగా 9వ రోజు సామూహిక ఊరేగింపు ద్వారా చేయడం వస్తుంది. సర్కిల్ పరిధిలోని గణనాథులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన గణనాథులను పత్తికుంట, పల్లె చెరువు, మీరాలం ట్యాంక్‌లలో నిమజ్జనం చేశారు. పత్తికుంట చెరువులో ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం 700 విగ్రహాలను నిమజ్జనం చేశారు. పల్లె చెరువులో 250, మీరాలం చెరువులో 45 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. నియోజకవర్గ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పత్తికుంట చెరువు వద్ద స్వాగత వేదికను ఏర్పాటు చేసి యువతీ, యువకుల నృత్యాలు, భజనలతో గణనాథులకు స్వాగతం పలికారు. పత్తికుంట దారి భక్తులతో కిక్కిరిసింది. 5 గంటలకే దాదాపు 2 కిలో మీటర్ల మేరకు గణనాథుల వాహనాలు బారులు తీరాయి. నిమజ్జనం ఏర్పాట్లను డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న, ఉప కమిషనర్ రవి కుమార్‌తో పాటు విద్యుత్, జలమండలి, ఇరిగేషన్, ట్రాఫిక్ తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.



బైరాగిగూడ శివసాయినగర్ కాలనీ లైన్-3లో నిర్వహించిన వేలంలో బాలగణపతి లడ్డూని భక్తులు రూ.51 వేలకు, సిద్ధివినాయకుడి లడ్డూని రూ.2,00,116కి, స్వామివారి కండువాలను రూ.47వేలకు పాడుకున్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం



మణికొండ: నవరాత్రి పూజలు అందుకున్న వినాయకులను ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి మొదలుకుని రాత్రి వరకు వినాయకుని లడ్డూల వేలం పాటలను ముగించుకుని శోభాయమానంగా ఊరేగింపుగా తీసుకుని వెళ్లి ప్రతిమలను నిమజ్జనం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్నచెరువు పక్కన ఉన్న నిమజ్జన సాగర్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గణపతులను కోకాపేట చెరువులో నిమజ్జనం చేశారు. కొన్ని వినాయకులకు అర్ధరాత్రి దాటాక తెల్లవారు జాము వరకు నిమజ్జనాలు జరిగాయి. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలో ఏర్పాటు చేసిన మెజార్టీ ప్రతిమలు నిమజ్జనం పూర్తి చేసుకున్నాయి. మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన ఆలయాలు, కూడలిలలో ఏర్పాటు చేసిన గణపతులను మంగళవారం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.



మణికొండ బీఆర్‌సీ గేటెడ్ కమ్యూనిటీలో నిమజ్జనానికి తరలిస్తున్న నివాసితులు

అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తాం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో సోమవారం రూ.50లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు పనులను నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కౌన్సిలర్ పద్మ వీరారెడ్డితో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని అవసరం అయిన అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని చైర్‌పర్సన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుప్పాలగూడలోని లడ్డూను రూ. 2.31 లక్షలకు స్వంతం చేసుకున్న కస్తూరి యాదయ్య

అన్ని దానాల్లో కన్న.. రక్తదానం మిన్న

- మసీదులో రక్తదాన శిబిరం
- చిల్కూరు బాలాజీ అర్చకులు రంగరాజన్ హాజరు
- వెల్లివెరిసిన మతసామరస్యం



రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

రాజేంద్రనగర్: హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని మసీదు-ఈ-మహమ్మద్ హుస్సేన్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి చిల్కూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ ఆలయ సిబ్బందితో కలిసి వచ్చారు. ఈ శిబిరంలో హిందూ, ముస్లింలు రక్తదానం చేశారు. రాష్ట్ర ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తాన్ని సమీకరించేందుకు ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంవత్సరానికి దాదాపు 2500 పెద్ద, 4000 చిన్న శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని, క్యాన్సర్‌తో బాధపడుతున్న పిల్లలకు కీమోథెరపి చేస్తున్నప్పుడు తరుచూ రక్తమార్పిడి అవసరం. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, చిల్కూర్ బాలాజీ ఆలయం 5 ఏళ్లుగా కలిసి పని చేస్తుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ.. ముస్లిం సోదరుల కృషి అభినందనీయమని, రక్తదానం ఎంతో మంది జీవితాలను రక్షిస్తుందన్నారు. అత్యున్నత మానవీయ విలువలు, దయను బోధించిన ఇస్లాం ప్రవక్త జన్మదినోత్సవం కంటే గొప్ప రోజు ఏదీ ఉండదన్నారు. ఈ శిబిరంలో హిందువులు కూడా ముందుకు వచ్చి రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ హసన్ అస్కారీ మాట్లాడుతూ.. గత 10ఏళ్లుగా ఈ క్యాన్సర్ ఆసుపత్రితో కలిసి పని చేస్తున్నామని, ఈ రోజు చైల్డ్ క్యాన్సర్ రోగుల కోసం కనీసం 200 యూనిట్ల రక్తాన్ని దానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ రక్తం ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959154371, 9963980259లో సంప్రదించాలన్నారు.

అత్తాపూర్: ఈద్-ఉన్-నబి పర్వదినం సందర్భంగా సులేమాన్‌నగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులతో పాటు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాలలో కన్న రక్తదానం ఎంతో గొప్పదని, తలసేమియా, సికిల్ సెల్, క్యాన్సర్ బాధితులకు ఎంతో అవసరం ఉందని, రక్తదానం చేసేందుకు యువకులు ముందు వరుసలో నిలవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సుహాసిని, జ్యోష్న, సంతోష్, ముస్లీం సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో చిల్కూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు